క్లుప్తంగా

యువత రక్తదానం చేయడం అభినందనీయం



దోమకొండ: యువత రక్తదానం చేయడానికి ముందుకు రావడం అభినందనీయమని ఐవీఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ రెడ్‌క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు అన్నారు. దోమకొండ మండల కేంద్రంలో మన ఉగాది సిండికేట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఐదో రక్తదాన శిబిరంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు, రక్తదానం మించినది మరొక్కటి లేదన్నారు. కార్యక్రమంలో మన ఉగాది సిండికేట్ ప్రతినిధులు మ్యాక నాగరాజు, బలే సురేందర్, కామారెడ్డి జిల్లా రక్తదాతల సమూహం ఉపాధ్యక్షులు జమీల్ అహ్మద్, ప్రభుత్వ వైద్యశాల రక్తనిధి కేంద్రం టెక్నీషియన్లు అమర్, నూర్‌సింగ్, పోశెట్టి పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలికి ఉత్తమ అవార్డు



బిచ్కుంద(జుక్కల్): మండలంలోని పుల్కల్ జెడ్పీహెచ్ఎస్ హిందీ ఉపాధ్యాయులు హజారి మనోజ ఆదివారం నేషనల్ రాధాకృష్ణన్ టీచర్స్ అవార్డు అందుకున్నారు. పుల్కల్ పాఠశాలలో అందిస్తున్న సేవలు, బోధన ఇతర సామాజిక కార్యక్రమాలను గుర్తించి నిజామాబాద్‌లో సంస్థ ఫౌండర్ అజిత్ కుమార్ చౌహాన్ చేతుల మీదుగా అవార్డును అందించారు. భోలాసింగ్, సంతోష్ మానే తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు



పెద్దకొడప్‌గల్(జుక్కల్): మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై మహేందర్ తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం అంజని చౌరస్తా సమీపంలో డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. వాహనదారులు ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి, ధ్రువపత్రాలు తమ వద్ద ఉంచుకోవాలన్నారు. పిల్లలకు వాహనాలు ఇవ్వొద్దని సూచించారు. పోలీస్ సిబ్బంది సాయి, శివ, శ్రీను, అంజి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత షుగర్ నిర్ధారణ శిబిరం

పిట్లం(జుక్కల్): లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో ఆదివారం ఉచిత షుగర్ నిర్ధారణ శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 11 మందికి ఉచితంగా షుగర్ పరీక్షలు నిర్వహించారు. షుగర్ నిర్ధారణ అయిన నలుగురికి డాక్టర్ రష్మిత కౌన్సిలింగ్ చేసి ఒక నెలకు సరిపడా మందులు అందజేశారు. లయన్స్ క్లబ్ కార్యదర్శి వేణుగోపాల్, కార్యదర్శి బాలు, రాజ్‌కుమార్, సంతోష్, ఆస్పత్రి డైరెక్టర్లు సుధాకర్, దయానంద్, సిబ్బంది పాల్గొన్నారు.

సరంపల్లిలో ..



కామారెడ్డి అర్బన్: శ్రీసత్యసాయి సేవా సంస్థలు యువజన విభాగం ఆధ్వర్యంలో ఆదివారం మున్సిపల్ పరిధిలోని సరంపల్లిలో గ్రామసేవ నిర్వహించారు. గ్రామంలో నాలుగు చోట్ల ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. డాక్టర్ బి.రాకేష్, డెంటల్ సర్జన్ బి.నవ్య, కాస్మోటాలిజిస్టు ఆర్.సందీప్‌కుమార్, జనరల్ ఫిజిషియన్ మన్నె సాయిలు పాల్గొని వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి పట్టణంలోని ముత్యాల పోచమ్మ ఆలయ ప్రాంగణంలో మంగళవారం రిటైర్డు ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు రిటైర్డు ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కిష్టయ్య ఆదివారం తెలిపారు. కంటి శిబిరంలో రిటైర్డు ఉద్యోగులు, ఉద్యోగస్తులు, వారి పిల్లలు, ఆరోగ్యశ్రీ కార్డు ఉన్న వారు పరీక్షలు చేయించుకోవాలని అన్నారు.

డిగ్రీ పరీక్షల ఫీజు చెల్లించాలి

బాన్సువాడ రూరల్: మండలంలోని శ్రీరాం నారాయణ ఖేడియా ప్రభుత్వ డిగ్రీ కళాశాల(అటానమస్)లో మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఈనెల 8లోగా పరీక్ష ఫీజు చెల్లించాలని ప్రిన్సిపల్ డాక్టర్ వేణుగోపాలస్వామి అన్నారు. బీఏ విద్యార్థులు రూ.1200, బీకాం, బీఎస్సీ విద్యార్థులు రూ.1300 ఫీజు చెల్లించాలన్నారు. రూ.100 అపరాధ రుసుముతో ఈనెల 11 వరకు పరీక్ష ఫీజు చెల్లించడానికి అవకాశం ఉందన్నారు.

‘ఆధార్’ అవస్థలు తప్పేదెన్నడో?

- స్థానికంగా ఆధార్ కేంద్రం లేకపోవడంతో జిల్లా కేంద్రానికి వెళ్లాల్సిన పరిస్థితి
- రాజంపేటలో ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని స్థానికుల విజ్ఞప్తి
- ఇబ్బందులు పడుతున్న నిరక్షరాస్యులు, వృద్ధులు



తహసీల్ కార్యాలయ ప్రాంగణంలో ఆధార్ కేంద్రం కోసం ఏర్పాటు చేసిన షెడ్

రాజంపేట: మండల కేంద్రంలో ఆధార్ నమోదు కేంద్రం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, పంట విక్రయాలు, తదితర వాటికి ఆధార్ కార్డు తప్పనిసరి. అదే విధంగా ఆధార్ కార్డుకు సెల్ నంబర్ లింక్ చేసుకుంటేనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు అర్హత ఉంటుంది. రాజంపేటలో ఆధార్ నమోదు కేంద్రం లేకపోవడంతో పలువురు జిల్లా కేంద్రం కామారెడ్డికి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో సమయం వృథా కావడంతో పాటు ఆర్థికంగాను ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఏడాదిన్నర క్రితం రాజంపేటకు ఆధార్ కేంద్రం మంజూరు కావడంతో తహసీల్ కార్యాలయ ఆవరణలో సొంత నిధులతో ప్రత్యేకంగా షెడ్డు వేసి ఆధార్ కేంద్రం ఏర్పాటు చేశాడు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో ప్రజలు ఆధార్ కార్డులో చేర్పులు, మార్పుల కోసం, కొత్త ఆధార్ కార్డుల కోసం కామారెడ్డికి వెళ్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. గతంలో కమీషన్ ఆధారంగా ఆధార్ కేంద్రాలను నిర్వహించేవారు. ప్రస్తుతం నిబంధనలు మార్పు చేయడంతో ఆధార్ కేంద్రాల ఏర్పాటు ఆలస్యం అవుతోందని నిర్వాహకులు వాపోతున్నారు.

ఏర్పాటుకు తోడ్పడాలి

రాజంపేటలో ఆధార నమోదు కేంద్రం ఏర్పాటుకు పాలకులు స్పందించాలి. ప్రతి చిన్న పనికి కామారెడ్డి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. చిన్న పిల్లలకు కొత్తగా ఆధార్ కార్డు, ఇతరత్రా పనుల నిమిత్తం తీసుకోవాలంటే ఇబ్బందులు తప్పడం లేదు.

– కుంభాజి రాము, రాజంపేట

తెలంగాణాలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమే



బస్వాపూర్‌లో మాట్లాడుతున్న కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి

- కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

భిక్కనూరు: తెలంగాణలో 2027లో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం తథ్యమని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. ఆదివారం బస్వాపూర్‌లో నిర్వహించిన మండల బీజేపీ కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యకర్తల వల్లే బీజేపీకి రోజురోజుకు ప్రజల్లో ఆదరణ పెరుగుతోందన్నారు. కామారెడ్డి నియోజవకర్గంలో ఎలాంటి అక్రమాలు అవినీతి జరిగినా ఊరుకునేది లేదన్నారు. ఫిర్యాదుల బాక్స్‌ల్లో ప్రజలు వేస్తున్న దరఖాస్తులను పరిశీలించి వాటి పరిష్కారం కోసం కృషి చేస్తున్నామన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించేందుకు కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా 100 బీజేపీ సాధారణ సభ్యత్వాలను 22 క్రియాశీలక సభ్యత్వాలను చేశారు. బీజేపీ మండలాధ్యక్షుడు ఉప్పరి రమేష్, మండల ఇన్‌చార్జి శ్రీధర్ రెడ్డి, నేతలు బండి రాములు, గంగధారి రామచంద్రం, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కార్యకర్తా కృషి చేయాలి

కామారెడ్డి టౌన్: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో జిల్లాలో వార్డు సభ్యుడి నుంచి జెడ్పీ చైర్మన్ వరకు బీజేపీ అభ్యర్థులే విజయం సాధించాలని, ఇందుకోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఎమ్మెల్యే కోరారు. ఆదివారం జిల్లా పార్టీ కార్యాలయంలో కామారెడ్డి, రాజంపేట మండలాల కార్యవర్గ సమావేశం నిర్వహించగా ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. నియోజకవర్గంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ఇంకా వేగవంతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. బూత్ అధ్యక్షుడి నుంచి జిల్లా స్థాయి నాయకుల వరకు అందరూ స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలని ఆదేశించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్ రెడ్డి, కామారెడ్డి, రాజంపేట మండలాల అధ్యక్షులు శ్రీనివాస్, శ్రీధర్, మహిళా నాయకులు సంధ్య, నాయకులు ఆనందరావు, గంగారెడ్డి, నరేష్ రెడ్డి, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

రామారెడ్డి: కార్మికుల సమస్యలను పరిష్కరించాలని బీఎస్ఆర్‌కేఎస్ రామారెడ్డి మండల శాఖ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డిని ఆదివారం కామారెడ్డిలో కలిసి వినతి అందజేశారు. అనంతరం ఎమ్మెల్యేను సన్మానించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాయి కుమార్, మండల ప్రధాన కార్యదర్శి పూసల శివ, జిల్లా నాయకులు శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియా బారి నుంచి క్రీడలే రక్షించాలి

- ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు
- పోసానిపేటలో రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలు ప్రారంభం



క్రీడలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

రామారెడ్డి: నేటి సాంకేతిక యుగంలో యువత సోషల్ మీడియాకు విపరీతంగా బానిసలయ్యారని వాటి నుంచి క్రీడలే రక్షించాలని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు అన్నారు. ఆదివారం పోసానిపేటలో 68వ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-14 గరల్స్ ఖోఖో టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు ప్రారంభించి మాట్లాడారు. తాను రామారెడ్డిలో ప్రభుత్వ పాఠశాలలో ఆ తర్వాత ఎర్రపాడులో ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్నానని ఆ సమయంలో ఎల్లారెడ్డి ఎమ్మెల్యేగా బాలాగౌడ్ ఉన్నారన్నారు. అప్పటి ఎమ్మెల్యే బాలాగౌడ్‌ను ఆదర్శంగా తీసుకొని ప్రజాసేవ చేసే ఉద్దేశంతో రాజకీయాల్లోకి వచ్చానని చెప్పుకొచ్చారు. రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలు పోసానిపేటలో జరగడం శుభపరిణామమని భవిష్యత్తులో క్రీడలను ప్రోత్సహిస్తానన్నారు. అంతకు ముందు క్రీడాజ్యోతిని వెలిగించి అనంతరం విద్యార్థులను నుంచి గౌరవం వందనం స్వీకరించారు. పోసానిపేటలోనే గౌతమ బుద్ధుడు, జ్యోతీరావుపూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలను ఆవిష్కరించారు. ఎంఈవో ఆనంద్‌రావు, వడ్లూర్ ఎల్లారెడ్డి సింగిల్ విండో చైర్మన్ సదాశివరెడ్డి, మాజీ ఎంపీపీ దశరథ్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ మోహన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మహేందర్‌రెడ్డి, హెచ్ఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

బారడి పోచమ్మ పండుగ



నస్రుల్లాబాద్(బాన్సువాడ):మండల కేంద్రంలో ఆదివారం బారడి పోచమ్మ పండుగను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి బోనాలు తీశారు. గ్రామ కమిటీ చైర్మన్ కంది మల్లేష్, గంగారాం, భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.

మైసమ్మ ఆలయంలో భక్తుల సందడి

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మైలారంలో గల కొచ్చెరి మైసమ్మ ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. ముహూర్తాలు ప్రారంభం అవ్వడంతో మొక్కులు చెల్లించుకోవడానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు

పిట్లం(జుక్కల్): పోతురెడ్డిపల్లి హనుమాన్ ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఆలయ నిర్వహకులు తేజ స్వామి పాల్గొన్నారు.

మన్మథ స్వామి పుణ్యక్షేత్రానికి పాదయాత్ర



బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలోని బండాయప్ప మఠం పీఠాధిపతి సోమాయప్ప స్వామీజీ ఆధ్వర్యంలో ఆదివారం మన్మథ స్వామి పుణ్యక్షేత్రానికి పాదయాత్రగా భక్తులు బయలుదేరి వెళ్లారు. మహారాష్ట్ర బీడ్ జిల్లాలో ఈ పుణ్యక్షేత్రం ఉంది. 13 రోజులు ఈ పాదయాత్ర సాగి ఈ నెల 15న దిండి మన్మథ స్వామి పుణ్యక్షేత్రానికి చేరుతుంది. జుక్కల్, నారాయణ్‌ఖేడ్, బాన్సువాడ నియోజకవర్గాల నుంచి సుమారు 700 మంది భక్తులు వెళ్తున్నారు.

రైతు వ్యతిరేక విధానాలపై నిరసన



నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

బాన్సువాడ రూరల్: రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ బోర్లం గ్రామంలో ఆదివారం బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఆందోళన చేపట్టారు. గ్రామంలోని గాంధీ కూడలి, అంబేడ్కర్ కూడలి వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించి మాట్లాడారు. గ్రామంలో అక్టోబర్ 18న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించినా సొసైటీ చైర్మన్ నిర్లక్ష్యం వల్ల నేటికీ కాంటాలు ప్రారంభం కాలేవన్నారు. సన్నవడ్ల కొనుగోలుకు ఇచ్చే బోనస్ విషయంలో అనేక కొర్రీలు పెట్టడంతో రైతులు బోనస్‌కు నోచుకోలేకపోతున్నారని విమర్శించారు. నాయకులు మన్నె అనిల్, జీవన్, మమ్మాయి లక్ష్మణ్, దుర్కి గంగాధర్, బాలు, సాయిలు పాల్గొన్నారు.

నేడు తాడ్వాయిలో ప్రజావాణి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): స్థానిక తహసీల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ రహిమొద్దీన్ తెలిపారు. ఈ ప్రజావాణి ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కొనసాగుతుందని, ఈ కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు హాజరవుతారన్నారు. సమస్యలున్నట్లయితే ఈ ప్రజావాణిలో ఫిర్యాదు చేసుకోవాలని సూచించారు.

తడిసిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలి



కామారెడ్డి రూరల్: అకాల వర్షాలతో తడిసిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దేవయ్య డిమాండ్ చేశారు. ఆదివారం వడ్లూర్, ఉగ్రవాయి, రామేశ్వరపల్లి గ్రామాలలో రైతులు ఆరబోసిన వరి ధాన్యాన్ని పరిశీలించారు. తక్షణమే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలన్నారు. వరి ధాన్యం తడిసిపోకుండా ఉండేందుకు రైతులకు సరిపడా ప్లాస్టిక్ కవర్లను పంపిణీ చేయాలన్నారు. నాయకులు నర్సింలు, రాజయ్య తదితరులున్నారు.

ఫ్లెక్సీ దహనంపై విచారణ



లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని జంబి హనుమాన్ మందిరంలో ఏర్పాటు చేసిన హనుమాన్ చాలీసా ఫ్లెక్సీ దహనం కావడంతో వివాదంగా మారింది. మందిరంలో ఫ్లెక్సీ, జెండాలు, ఆలయం కడిగిన నీళ్ల పోవడానికి ఏర్పాటు చేసిన పైపు సైతం కాలిపోయి ఉండటం ఆలస్యంగా వెలుగు చూసింది. ఆదివారం గ్రామస్తులు పోలీసుల దృష్టికి ఈ విషయం తీసుకెళ్లారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. గ్రామస్తులు ఇచ్చిన సమాచారం మేరకు ఎల్లారెడ్డి సీఐ రవీందర్ విచారణ చేపట్టినట్లు తెలిపారు. లింగంపేట జంబి హనుమాన్ విగ్రహాన్ని గతంలో గుర్తు తెలియని వ్యక్తులు గొడ్డలితో నరికిన ఘటన మరువక ముందే ఫ్లెక్సీ దగ్ధం కావడం కలకలం రేపుతోంది. ఒకే మందిరంలో రెండు సార్లు ఘటనలు జరగడంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డును ఆక్రమిస్తున్న ముళ్ల చెట్లు



మద్నూర్(జుక్కల్): మండలంలోని పెద్ద తడ్గూర్, అంతాపూర్, గోజేగావ్, చిన్న ఎక్లార తదితర గ్రామాలకు వెళ్లే రహదారులకు అడ్డంగా ముళ్లపొదలు పెరిగి పోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుకు అడ్డుగా ఉన్న ముళ్లపొదలను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

శుభకార్యానికి ప్రభుత్వ సలహాదారు హాజరు



కామారెడ్డి టౌన్: కాంగ్రెస్ పార్టీ జిల్లా నేత గంప కృష్ణ కుమార్తె దివ్య- సాయి కృష్ణల ఎంగేజ్మెంట్ ఆదివారం జిల్లా కేంద్రంలోని శుభం కన్వెన్షన్ హాల్‌లో జరిగింది. ఈ శుభకార్యానికి ప్రభుత్వ సలహాదారురు షబ్బీర్ అలీ హాజరై వారిని ఆశీర్వదించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి, నాయకులు గోనె శ్రీనివాస్, గూడెం శ్రీనివాస్, పున్నరాజేశ్వర్, గణేష్‌నాయక్, తిర్మల్‌రెడ్డి, దేవరాజ్, పంపరి శ్రీను, కృష్ణహరి పాల్గొన్నారు.

ప్రతి గింజా ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది

ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి

బాన్సువాడ/బాన్సువాడ రూరల్ : రైతులు పండించిన ప్రతి గింజనూ ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఆదివారం బీర్కూర్ మండలం కిష్టాపూర్, బాన్సువాడ మండలం దేశాయిపేట్, కొల్లూర్, నాగారంలలో ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్‌తో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న దొడ్డు రకం బియ్యాన్ని ప్రజలు తినలేని పరిస్థితి ఉన్నందున సన్న రకం ధాన్యాన్నే పండించేలా రైతులను ప్రోత్సహించేందుకు రూ.500 బోనస్ ఇస్తుందని అన్నారు. రైతులు ఆర్థికంగా బలోపేతం కావాలనే సంకల్పంతో ప్రభుత్వం ఉందని అన్నారు. రైతులు పండించిన పంటను ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని సూచించారు. ఆర్థికపరమైన సమస్యల వల్ల పూర్తి స్థాయిలో రుణమాఫీ చేయడంలో కొంత ఆలస్యమైనా కచ్చితంగా నూటికి నూరు శాతం రుణమాఫీ చేస్తామని అన్నారు. ప్రస్తుతం నిజాంసాగర్‌లో పుష్కలంగా నీరున్నందున వచ్చే యాసంగి, వానాకాలం పంటలకు ఢోకా లేదని చెప్పారు. నాయకులు కృష్ణారెడ్డి, అవారి గంగారాం, బోయిని శంకర్, ఆరిఫ్, రాజు తదితరులు ఉన్నారు.



కిష్టాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పోచారం, కాసుల బాల్‌రాజ్

ఎట్టకేలకు ప్రారంభమైన కొనుగోళ్లు



తూకం ప్రారంభిస్తున్న తహసీల్దార్ నరేందర్

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని 41 జీపీల పరిధిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఆదివారం ఎట్టకేలకు తూకం ప్రారంభించారు. ప్రభుత్వం రైస్‌మిల్లర్లతో జరిపిన చర్చలు ఫలించడంతో పలు రైస్‌మిల్లులకు అలాట్‌మెంట్ ఇచ్చినట్లు తహసీల్దార్ నరేందర్ తెలిపారు. అధికారులు కొనుగోలు కేంద్రాల్లో హమాలీల సంఖ్యను పెంచి తూకం వెంటనే చేసేలా చూడాలని రైతులు కోరుతున్నారు. తహసీల్దార్ నరేందర్ ఆదివారం పలు కొనుగోలు కేంద్రాలు సందర్శించారు. రైతులు పండించిన ప్రతి గింజా కొంటామన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం



సాతెల్లిలో ప్రారంభిస్తున్న సొసైటీ చైర్మన్ నర్సింలు

ఎల్లారెడ్డి: సాతెల్లి, తిమ్మారెడ్డి, తిమ్మారెడ్డితండా గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సొసైటీ చైర్మన్లు నర్సింలు, పటేల్ సాయిలు వేర్వేరుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ధాన్యం విక్రయించాలని సూచించారు. ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మెన్ పద్మ శ్రీకాంత్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సాయిబాబా, కాంగ్రెస్ నాయకులు నునుగొండ శ్రీనివాస్, విద్యాసాగర్, వెంకట్రాంరెడ్డి, కౌన్సిలర్ కుడుముల సత్యనారాయణ, సొసైటీ డైరెక్టర్ నాగం గోపికృష్ణ, తదితరులున్నారు.

అంధకారంలో హాస్టళ్ల దారి..!



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట మండల కేంద్రంలోని కస్తూర్బా హాస్టల్‌తోపాటు మోడల్ స్కూల్ హాస్టల్‌కు వెళ్లే దారి రాత్రయిందంటే చాలు అంధకారంగా మారుతోంది. ప్రధాన రహదారిపై నుంచి హాస్టల్‌కు వెళ్లే దారిలో ఎలాంటి లైట్లు ఏర్పాటు చేయకపోవడం వల్ల రాత్రయితే ఆ దారి పూర్తిగా చీకటిమయమవుతుంది. బాలికలు వసతి పొందుతున్న రెండు హాస్టళ్లకు సంబంధించిన దారి అంధకారంగా ఉండడం వల్ల రాత్రివేళ విద్యార్థినులతోపాటు హాస్టల్ సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళ రెండు హాస్టళ్లలోని విద్యార్థినులకు ఏదైనా ఆరోగ్య సమస్య వస్తే వారిని ఆస్పత్రికి తీసుకువచ్చేందుకు సిబ్బంది తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి తమ హాస్టళ్లకు వచ్చే దారిలో లైట్లు ఏర్పాటు చేయాలని విద్యార్థినులు, సిబ్బంది కోరుతున్నారు.

శాసన మండలిలో గొంతు వినిపిస్తా



మాట్లాడుతున్న ప్రసన్న హరికృష్ణ

బాన్సువాడ: పట్టభద్రుల సమస్యలపై శాసనమండలిలో గొంతు వినిపిస్తానని పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి పోటీ చేయాలని భావిస్తున్న ప్రసన్న హరికృష్ణ అన్నారు. ఆదివారం బాన్సువాడలోని హాసిని ప్రియ ఫంక్షన్ హాల్‌లో పట్టభద్రులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించి మాట్లాడారు. తాను ఉద్యోగానికి రాజీనామా చేసి ప్రజాసేవ చేయడానికి వచ్చానని అన్నారు. ప్రస్తుతం శాసన మండలి రాజకీయ నిరుద్యోగులకు పునరావాస కేంద్రంగా తయారైందని విమర్శించారు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా కృషి చేస్తానని అన్నారు. ఎంఈవో నాగేశ్వర్‌రావు, విఠల్, ఆనంద్, మైశయ్య, శ్రీనివాస్, పత్తి శ్రీనివాస్, మంద ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ డిపోలో వైద్య పరీక్షల కేంద్రం ప్రారంభం



ప్రారంభిస్తున్న ఆర్టీసీ అధికారిణి పద్మజ

బాన్సువాడ: ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ ఆదేశాల మేరకు ఆదివారం బాన్సువాడ ఆర్టీసీ బస్ డిపోలో వైద్య పరీక్షల కేంద్రం ప్రారంభించారు. ఈ కేంద్రాన్ని ఆర్టీసీ అధికారిణి పద్మజ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆర్టీసీ సంస్థలో పని చేస్తోన్న సిబ్బంది జీవిత భాగస్వామికి వైద్య పరీక్షలు చేయనున్నట్లు, ఈసీజీతో పాటు అన్ని రకాల రక్త, బీపీ పరీక్షలు చేసి వాటిపై తగు సలహాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. సిబ్బంది ఆరోగ్యంగా ఉన్నప్పుడే ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేస్తారని అన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ సూపరింటెండెంట్ బసంత్, కిష్టయ్య, జానాబాయి, సిబ్బంది జగదీశ్వర్, హెల్త్ వాలంటీర్లు సంతోష్, విజయ తదితరులున్నారు.